క్లుప్తంగా

నేడు గ్రామ దేవతల పండగ మహోత్సవాలు



పరవాడ: మండలంలో వెన్నలపాలెం, రావాడ శివారు జల్లెలపాలెం గ్రామాల్లో కొలువుదీరిన గ్రామదేవతలు దుర్గ మాంబ, మరిడిమాంబ పండగ మహోత్సవాలను గురువారం వైభవంగా నిర్వహించనున్నట్లు ఆయా గ్రామాల ఉత్సవ కమిటీ ప్రతినిధులు తెలిపారు. వేకువ జాము నుంచి భక్తులు గ్రామ దేవతలను దర్శించుకునేందుకు వీలుగా ఆలయాల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేశామన్నారు. భక్తులకు ఉచిత మంచినీరు, ప్రసాదాలను అందించనున్నట్లు తెలిపారు. రాత్రికి అమ్మవార్లను ఆయా గ్రామాల పురవీధుల్లో డప్పువాయిద్యాలు, చిడతలు, సాముగరిడీలు, తప్పెటగుళ్లు, నేల డ్యాన్సులతో ఊరేగిస్తామన్నారు. భారీ బాణసంచా వెలుగుల మధ్య అనుపు మహోత్సవాలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. పండగను పురస్కరించుకుని గ్రామాల్లో పలు సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించనున్నట్లు ఉత్సవ కమిటీల ప్రతినిధులు వెల్లడించారు.

అప్పన్న సన్నిధిలో నంద్యాల కలెక్టర్



కప్పస్తంభానికి మొక్కుకుంటున్న నంద్యాల జిల్లా కలెక్టర్ బి.రాజకుమారి దంపతులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని నంద్యాల జిల్లా కలెక్టర్ బి.రాజకుమారి దంపతులు బుధవారం దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. అంతరాలయంలో ఆమె పేరిట అర్చకులు స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద ఆశీర్వచనం అనంతరం ఆలయ సాంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదం, శేష వస్త్రాలను సూపరింటెండెంట్ త్రిమూర్తులు అందించారు.

మజ్జిగ చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రంలో మజ్జిగ పంపిణీ చేస్తున్న కరణంరెడ్డి నరసింగరావు

పెదగంట్యాడ: జీవీఎంసీ 73వ వార్డు పరిధి ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయం సమీపంలో ఆర్ ఆర్ హెల్పింగ్ హ్యాండ్స్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రాన్ని బీజేపీ గాజువాక నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు ప్రారంభించారు. అనంతరం పాదచారులు, వాహనచోదకులకు మజ్జిగ పంపిణీ చేశారు. ప్రతి రోజూ మజ్జిగ పంపిణీ చేయనున్నామని ట్రస్ట్ సభ్యులు తెలిపారు.

'కాంట్రాక్ట్ కార్మికుల తొలగింపును అడ్డుకోవాలి'

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ కార్మికుల అక్రమ తొలగింపును అడ్డుకోవాలని స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ కార్మిక సంఘాల నాయకులు కోరారు. ఈ మేరకు వారు బుధవారం న్యూఢిల్లీలోని కేంద్ర చీఫ్ లేబర్ కమిషనర్‌కు విజ్ఞప్తి చేశారు. స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం గతేడాది సెప్టెంబర్‌లో ఒకేసారి 4 వేల మందిని తొలగించిందని వివరించారు. దానిపై వ్యతిరేకత రావడంతో తాత్కాలికంగా వాయిదా వేశారన్నారు. తాజాగా 1503 మంది కాంట్రాక్ట్ కార్మికులను తొలగించారన్నారు. ఈ అంశంపై రీజనల్ లేబర్ కమిషనర్ (ఆర్‌ఎల్‌సీ) సమక్షంలో అనేక మార్లు చర్చలు జరిగాయన్నారు. ఆ చర్చల్లో ఆర్‌ఎల్‌సీ పలు సూచనలు చేసినా యాజమాన్యం వైఖరిలో మార్పు రాలేదని వివరించారు. కార్యక్రమంలో అఖిలపక్ష నాయకలు నమ్మి రమణ (సీఐటీయూ), ఎల్. సోమరాజు (ఏఐటీయూసీ), కె. వంశీకృష్ణ (ఇంటక్), ఉరుకూటి అప్పారావు (హెచ్‌ఎంఎస్), డి. అప్పన్న (టీఎన్‌టీయూసీ), పి. భాస్కరరావు (నిర్వాసిత సంఘం)పాల్గొన్నారు.

కుట్టు శిక్షణతో స్వయం ఉపాధి



మహిళకు సర్టిఫికెట్ అందజేస్తున్న ప్రతినిధులు

ఉక్కునగరం: సత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో టైలరింగ్ శిక్షణ పొందిన మహిళలకు బుధవారం సర్టిఫికెట్లు అందజేశారు. మహిళా సాధికారిత కార్యక్రమాల్లో భాగంగా 60 మంది ఆర్థికంగా వెనుకబడిన మహిళలకు 40 రోజుల పాటు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మహిళలకు బ్లౌజ్‌లు , వివిధ రకాల గాగ్రా మోడల్స్‌తో వివిధ డిజైన్లలో పిల్లల దుస్తులు కుట్టడడంపై శిక్షణ ఇచ్చారు. ముగింపు కార్యక్రమంలో జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ కోఆర్డినేటర్ అపర్ణ, సత్యసాయి సేవా సమితి కన్వీనర్ జి.రామకృష్ణ, కె.ఎస్.ఎన్. రాజు, పద్మ, డి.ఎ.వి సన్యాసిరాజు, జయ, గౌరి, కామేశ్వరి, వి. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



వేపగుంట జెడ్పీ హైస్కూల్ టాపర్ శ్రీవేద(593)ను అభినందిస్తున్న ఎంఈవో సువర్ణ, హెచ్‌ఎం



అడవివరం జెడ్పీ హైస్కూల్ టాపర్ ఎ.విష్ణువర్ధన్‌సాయి(588)ని అభినందిస్తున్న పాఠశాల హెచ్‌ఎం ఇమంది పైడిరాజు, ఉపాధ్యాయులు



సింహాచలం దేవస్థానం సంస్కృతోన్నతపాఠశాలలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులతో హెచ్‌ఎం భాను, ఉపాధ్యాయులు



పెందుర్తి జీహెచ్‌ఎస్‌లో 590 మార్కులు వచ్చిన రేపాక గ్రీష్మను అభినందిస్తున్న ఎంఈవో సువర్ణ, హెచ్‌ఎం చిన్నమ్మాయి

పదిలో మెరిసిన పేదింటి పిల్లలు

ప్రభుత్వ పాఠశాలల్లో అత్యుత్తమ ఫలితాలు

పెందుర్తి మండలంలో 84.39 శాతం ఉత్తీర్ణత



జి.సౌజన్య, 591/600, నరవ జెడ్పీ హైస్కూల్



డి.కేశవనిధి 590 సింహాచలం బీసీ గురుకుల పాఠశాల



ఎస్.రెశ్వంత్‌సాయి (588) సింహాచలం బీసీ గురుకుల పాఠశాల



జి.అర్జున్ (585) సింహాచలం బీసీ గురుకుల పాఠశాల



ఆర్.జ్యోత్స్న (587) గురుకుల పాఠశాల, తానాం



డి.మహేశ్వరి (585) జెడ్పీ పాఠశాల, పెదముషిడివాడ



బి.హర్షిత్ (585/600) తవ్వవానిపాలెం జెడ్పీహెచ్‌ఎస్



ఎస్.గౌతమి (584/600) ఆరిపాక జెడ్పీ హెచ్‌ఎస్



కె.చరిష్మ 583/600 సబ్బవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల



ఎం.మోహన్, 562/600 సబ్బవరం గురుకుల పాఠశాల

పెందుర్తి: కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన పిల్లలు బుధవారం విడుదలైన పదో తరగతి పరీక్షా ఫలితాల్లో సత్తా చాటారు. గత ప్రభుత్వంలో పాఠశాల విద్యపై చూపిన చొరవతో దాదాపు అంతా ఆంగ్ల మాధ్యమంలో పరీక్షలు రాసి అత్యుత్తమ ఫలితాలు సాధించారు. ఆర్థికంగా పేదింటి పిల్లలమే గానీ.. చదువుల్లో తామెవరికీ తీసిపోమని నిరూపించారు. పెందుర్తి మండలంలోని 10 జిల్లా పరిషత్, ఒక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1147 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 968(84.39శాతం) మంది ఉత్తీర్ణత సాధించారు.

- వేపగుంట హైస్కూల్లో 165 మందికి 134 మంది ఉత్తీర్ణత సాధించారు. 593 మార్కులతో ఇండిగ శ్రీవేద మండల స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచింది.
- నరవ పాఠశాలలో 123 మందికి 111 మంది పాస్ కాగా జి.సౌజన్య 591 మార్కులతో మండల స్థాయిలో ద్వితీయ స్థానం సాధించింది.
- పెందుర్తి ప్రభుత్వ పాఠశాలలో 308 మందికి 237 మంది ఉత్తీర్ణత సాధించారు. రేబాక గ్రీష్మ 590 మార్కులతో మండల స్థాయిలో ఉమ్మడిగా తృతీయ స్థానంలో నిలిచింది.
- చింతలగ్రహారం జెడ్పీ హైస్కూల్లో 103 మందికి 99 మంది ఉత్తీర్ణులుకాగా, కె.కుసుమ 585 మార్కులు సాధించింది.
- నరవ బీసీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్లో శతశాతం(67 మందికి గాను 67 మంది) ఉత్తీర్ణత సాధించారు. ఎస్.బాబు కుశాల్‌కుమార్‌కు అత్యధికంగా 583 మార్కులు వచ్చాయి.
- వి.జుత్తాడలో 128 మందికి 119 మంది ఉత్తీర్ణత సాధించారు. ఎ.ప్రవల్లిక 575 మార్కులతో అగ్ర స్థానంలో నిలిచింది.
- చినముషిడివాడ(శాంతినగరం) పాఠశాలలో 43 మందికి 24 మంది పాసయ్యారు. అత్యధికంగా జీవీఎస్‌సీఎస్ మల్లేశ్వరి 564 మార్కులు సాధించింది.
- గొరపల్లిలో 22 మందికి 21 మంది ఉత్తీర్ణులు కాగా మండా లక్ష్మీప్రసన్న అత్యధికంగా 560 మార్కులు తెచ్చుకుంది.
- పెందుర్తి జెడ్పీ హైస్కూల్లో 66 మందికి 56 మంది ఉత్తీర్ణత సాధించారు. 560 మార్కులతో ఎం.సూరజ్ ప్రథముడిగా నిలిచాడు.
- గుర్రపాలెం హైస్కూల్లో 44 మందికి 36 మంది ఉత్తీర్ణత సాధించగా ఎన్.మేరీ 557 మార్కులతో అగ్రస్థానంలో నిలిచింది.
- సరిపల్లి జెడ్పీ హైస్కూల్ 50 మందికి 39 మంది పాసై, 551 మార్కులతో జి.రేష్మ ప్రథమంగా నిలిచింది.
- రాంపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 28 మందికి 25 మంది పాస్ కాగా అత్యధికంగా పి.హేమంత్ 531 మార్కులు సాధించాడు.



విద్యార్థులను అభినందిస్తున్న గ్రామ పెద్దలు



ఉత్తమ ఫలితాలు సాధించిన బి.హర్షిత్ తదితరులను అభినందిస్తున్న తవ్వవానిపాలెం పాఠశాల ఉపాధ్యాయులు



వాడచీపురుపల్లి జెడ్పీ స్కూల్ టాపర్లు తేజ స్వరూప, రెడ్డి చాందిని, ఎన్.గీతాశ్రీ

సింహాచలం: పదోతరగతి పరిక్షా ఫలితాల్లో సింహాచలంలోని మహాత్మా జ్యోతీబాపూలే ఏపీ బీసీ బాలుర సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థులు 97.27 శాతం ఉత్తీర్ణతతో సత్తా చాటారు. 147 మందికి 143 మంది ఉత్తీర్ణులయ్యారు. 590 మార్కులతో డి.కేశవనిధి టాపర్‌గా నిలిచాడు. 46 మంది 500 మార్కులకు పైగా సాధించినట్లు పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ భానుమతి తెలిపారు.

- అడవివరం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 86 శాతం ఉత్తీర్ణత నమోదైనట్టు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఇమంది పైడిరాజు తెలిపారు. పాఠశాల నుంచి మొత్తం 86 మంది పరీక్షలకు హాజరుకాగా 72 మంది ఉత్తీర్ణులయ్యారని, ఇందులో ఆరుగురు విద్యార్థులు 550 ఆపై మార్కులు సాధించినట్లు పేర్కొన్నారు. 588 మార్కులతో పాఠశాల టాపర్‌గా నిలిచిన ఎ.విష్ణువర్ధన్ సాయిని హెచ్‌ఎం పైడిరాజుతో పాటు ఉపాధ్యాయ బృందం అభినందించింది.
- సింహాచలం దేవస్థానం సంస్కృతోన్నత పాఠశాలలో 28 మందికి గాను 25 మంది ఉత్తీర్ణత సాధించారు. ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.

పరవాడ: మండలంలో 13 జిల్లా పరిషత్, ప్రభుత్వ పాఠశాలల నుంచి పదో తరగతికి చెందిన 756 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 87.57 శాతంతో 662 మంది ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈవో దివాకర్‌రావు తెలిపారు.

- పెదముషిడివాడ జెడ్పీ హైస్కూల్ నుంచి 85 మంది విద్యార్థులకుగాను 83 మంది ఉత్తీర్ణులయ్యారు. ఇందులో ఆర్‌సీ వెంకట జయ 595 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచింది. ఇదే పాఠశాలకు చెందిన పల్లా అనుష్క 592 మార్కులు, దాకమర్రి మహేశ్వరి 585 మార్కులు తెచ్చుకున్నారు.
- తానాం గురుకుల పాఠశాల నుంచి 78 మంది పరీక్షలకు హాజరుకాగా 77 మంది ఉత్తీర్ణత సాధించారు. పాఠశాలకు చెందిన వి.వెంకట లక్ష్మి 592 మార్కులతో టాపర్‌గా నిలిచింది. ఆర్.జ్యోత్స్న 587, కె.రాధిక 585 మార్కులు తెచ్చుకున్నారు.
- లంకెలపాలెం జెడ్పీ హైస్కూల్లో 119 మందికి 110 మంది ఉత్తీర్ణులయ్యారు.
- పినమడక హైస్కూల్ శతశాతం ఉత్తీర్ణత(18 మందికి 18 మంది) సాధించింది.
- లేమర్తి హైస్కూల్లో 40 మందికి 39 మంది, దేశపాత్రునిపాలెంలో 26 మందికి 18 మంది, పరవాడ జెడ్పీ బాలుర పాఠశాలలో 82 మందికి 59 మంది, పరవాడ బాలికల పాఠశాలలో 95 మందికి 84 మంది ఉత్తీర్ణులయ్యారు. ధర్మారాయుడుపేట పాఠశాలలో 34 మందికి 28 మంది, వాడచీపురుపల్లి స్కూల్లో 86 మందికి 76 మంది, ముత్యాలమ్మపాలెం స్కూల్లో 23 మందికి 22 మంది, తానాం ప్రభుత్వ పాఠశాలలో 33 మందికి 29 మంది, మెట్టపాలెం ప్రభుత్వ పాఠశాలలో 22 మందికి 19 మంది ఉత్తీర్ణత సాధించారు.
- పెదముషిడివాడ జెడ్పీ హైస్కూల్లో టెన్త్ ఫలితాల్లో టాపర్లుగా నిలిచిన ఆర్‌సీవెంకట జయ, పల్లా అనుష్క, డి.మహేశ్వరిలను గ్రామ సర్పంచ్ పల్లా అప్పారావు నాగమణి పుష్పగుచ్ఛం అందించి, శాలువాతో సత్కరించారు. పాఠశాల చైర్మన్ ఉరుకూటి సింహాచలం, పల్లా వెంకునాయుడు, బి.వెంకునాయుడు, దాలిబోయిన అప్పలరాజు, కలవలపల్లి సత్యనారాయణ, ఎం.కిరణ్, అగ్రిగోల్డ్ రాజు ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను అభినందించారు.

సబ్బవరం: పదోతరగతి పలితాల్లో మండలం 85.81 శాతం ఉత్తీర్ణత సాధించింది. 543 మంది పరీక్షలకు హాజరుకాగా 466 మంది ఉత్తీర్ణులైనట్లు మండల విద్యాశాఖాధికారి ఎం.జె.రవీంద్రబాబు తెలిపారు.

- మల్లునాయుడుపాలెం జెడ్పీ హైస్కూల్ 93 శాతం (55/59), తవ్వవానిపాలెం జెడ్పీ హైస్కూల్ 71 శాతం(15/21), సబ్బవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 87 శాతం(101/116)నంగినారపాడు జెడ్పీ హైస్కూల్లో 77 శాతం(77/100), ఆరిపాక జెడ్పీ హైస్కూల్ 72 శాతం(52/72), రావలమ్మపాలెం జెడ్పీ హైస్కూల్ 97 శాతం(62/64), సబ్బవరం కేజీబీవీలో 97 శాతం(36/37), డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల 92 శాతం(68/74) ఉత్తీర్ణత సాధించినట్లు వెల్లడించారు. మండలంలో అత్యధిక మార్కులు తవ్వవానిపాలెం జెడ్పీ హైస్కూల్‌కు చెందిన బి.హర్షిత్(585) సాధించి ప్రథమ స్థానంలో, ఆరిపాక జెడ్పీ హైస్కూల్ విద్యార్థి ఎస్.గౌతమి(584) ద్వితీయ, సబ్బవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థి చరిష్మ(583) తృతీయ స్థానంలో నిలిచినట్లు పేర్కొన్నారు.

నూకాంబిక ఆలయ నిర్మాణానికి భూమిపూజ



నూకాంబిక ఆలయానికి శంకుస్థాపన చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయికుడు పల్లా అప్పారావు

పరవాడ: పెదముషిడివాడ శివారు నక్కవానిపాలెంలో నూకాంబిక ఆలయ నిర్మాణానికి వైఎస్సార్‌సీపీ స్థానిక నాయకుడు పల్లా అప్పారావు(కబడ్డీ) బుధవారం భూమి పూజ నిర్వహించారు. గత ఎన్నికల్లో గ్రామస్తులకు ఇచ్చిన హామీ మేరకు అప్పారావు తన సొంత నిధులు రూ.15 లక్షలు ఆలయ నిర్మాణానికి ఖర్చు చేసేందుకు ముందుకు వచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, పెదముషిడివాడ ఉపసర్పంచ్ అలమండ వెంకటలక్ష్మి, గ్రామ పెద్దలు డి.అప్పలరాజు, బి.వెంకునాయుడు, పి.వెంకినాయుడు, కె.సత్యనారాయణ, శ్రీను, సింహాచలం, ప్రజలు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలే సమగ్ర వికాస నివాసాలు



పాఠశాల విద్యార్థుల ఫేర్‌వెల్ కార్యక్రమంలో పాల్గొన్న ఎంఈవో లక్ష్మణరావు తదితరులు

సబ్బవరం: ప్రభుత్వ పాఠశాలలు విద్యార్థుల సమగ్ర వికాసానికి నిలయాలని, వారి ఉజ్వల భవిష్యత్ కోసం గ్రామాల్లో ఉండే పిల్లలందరినీ ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని మండల విద్యాశాఖాధికారి ఎస్.లక్ష్మణరావు తల్లిదండ్రులకు పిలుపునిచ్చారు. మండలంలోని బాటజంగాలపాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యా సంవత్సరం ముగింపు సందర్భంగా 5వ తరగతి విద్యార్థుల ఫేర్‌వెల్–తల్లిదండ్రుల సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంఈవో, గ్రామ సర్పంచ్ పడాల వెంకటరమణతో కలిసి ఉపాధ్యాయులు రూపొందించిన అడ్మిషన్ల కరపత్రాన్ని, గోడ పత్రికలను ఆవిష్కరించారు. పిల్లల విద్యాభివృద్ధి కోసం ప్రభుత్వ సౌకర్యాలను ఉచితంగా ఉపయోగించుకునేలా ఎక్కువ మంది విద్యార్థులను చేర్పించాలని గ్రామస్తులకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా చిన్నారులు వేసిన జానపద కోలాటం ఎంతగానో ఆకట్టుకున్నాయి. తరగతుల వారీగా ప్రతిభ కనబరిచిన పిల్లలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో పాఠశాల కమిటీ చైర్మన్ బోలెం శంకరరావు, హెచ్‌ఎం పి.తమ్మారావు, ఉపాధ్యాయులు శిరీష, స్కూల్ కమిటీ సభ్యులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అ'పూర్వ' కలయిక.. ఆత్మీయ వేడుక



ఆత్మీయ కలయికలో 1974-75 బ్యాచ్

ఉక్కునగరం: వారంతా పరవాడ జిల్లా పరిషత్ పాఠశాల పూర్వ విద్యార్థులు. 50 ఏళ్ల తర్వాత మొదటిసారిగా కలుసుకున్నారు. వారి ఆనందానికి అంతే లేదు. వయసు మరిచిపోయారు. ఆడిపాడి సందడి చేశారు. వారే 1974–75 పదో తరగతి బ్యాచ్. వేర్వేరు వృత్తుల్లో ఎక్కడెక్కడో స్థిరపడిన వారంతా బుధవారం స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లోని స్టీల్‌క్లబ్‌లో కలిశారు. గత స్మృతులు నెమరు వేసుకున్నారు. 50 ఏళ్లలో జరిగిన విషయాలను పంచుకున్నారు. కుటుంబ సభ్యులు, వారి పిల్లలు సాధించిన విజయాలు చెప్పుకుంటూ పొంగి పోయారు. నాటి ఉపాధ్యాయులు కావలి రామారావు, పైలా సన్యాసిరావులను దుశ్శాలువ, పూలమాలలతో సత్కరించారు. ఉపాధ్యాయులకు పాదాభివందనం చేసి వారి ఆశీస్సులు తీసుకున్నారు. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన పి.ఎస్.వి.వి.ఎస్.వి. పి.టి.ఎస్.ఆర్. కుమార్, పాపయ్య పాత్రుడు, ఎర్ని సత్యనారాయణలను తోటి విద్యార్థులు అభినందించారు. మధుర జ్ఞాపకాలతో తిరుగుపయనమయ్యారు.

ఉగ్రవాదులు తగిన మూల్యం చెల్లించక తప్పదు



పెందుర్తి కూడలి వద్ద బీజేపీ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ



పెందుర్తి కూడలి వద్ద మేజర్ డిఫెన్స్ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ



కొవ్వొత్తుల ర్యాలీలో వీహెచ్‌పీ నాయకులు, వాకర్స్ క్లబ్ ప్రతినిధులు

పెందుర్తి: అమాయకులను అత్యంత కిరాతకంగా హతమార్చిన పాకిస్తాన్ ప్రేరేపిత ఉగ్రమూక ఖచ్చితంగా తగిన మూల్యం చెల్లించుకుంటుందని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గొర్లె రామునాయుడు హెచ్చరించారు. జమ్మూకాశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిలో అశువులుబాసిన 28 మంది ఆత్మలకు శాంతి చేకూరాలని కోరుకుంటూ, ఉగ్రదాడిని ఖండిస్తూ పెందుర్తి కూడలి వద్ద బీజేపీ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత్ ఎదుగుదలను తట్టుకోలేని పాకిస్తాన్ తమ రక్షణలో ఉన్న ఉగ్రవాదులను మన దేశం మీదికి ఉసిగొల్పుతోందని ఆరోపించారు. పహల్గాం దాడిపై ఖచ్చితంగా ప్రతీకార చర్య ఉంటుందని స్పష్టం చేశారు. పాకిస్తాన్ ప్రేరేపిత ఉగ్రదాడిని ప్రతి ఒక్కరూ ఖండించాలని పిలుపునిచ్చారు. ఆ పార్టీ కార్యకర్తలు, స్థానికులు పాల్గొన్నారు.

- స్థానిక మేజర్ డిఫెన్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఉగ్రదాడిని ఖండిస్తూ కొవ్వొత్తుల ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా అకాడమీ చైర్మన్ దిలీప్‌కుమార్ మాట్లాడుతూ పాకిస్తాన్ ప్రేరణతో ఉగ్రవాదులు 28 మంది అమాయకులను నిర్దాక్షిణ్యంగా చంపేశారని ఆవేదన వ్యక్తం చేశారు. మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. కేంద్ర ప్రభుత్వం ఈ ఘటనపై ఖచ్చితంగా చర్యలు తీసుకోవాలని కోరారు. డైరెక్టర్ రెడ్డి శ్రీనివాస్, పీఈటీ విశ్రాంత సుబేదార్ మోహన్‌రావు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

అడవివరంలో కొవ్వొత్తుల ర్యాలీ

సింహాచలం: జమ్ముకాశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాదుల దాడిని ఖండిస్తూ అడవివరంలో విశ్వ హిందూ పరిషత్, శ్రీ వరాహ లక్ష్మీనృసింహ వాకర్స్ క్లబ్ ప్రతినిధులు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఉగ్రవాదుల దాడిలో మృతిచెందిన వారికి నివాళులర్పించారు. ఉగ్రవాదుల దాడి చాలా హేయమైన చర్యగా అభివర్ణించారు. భారత సైనికులు ఉగ్రవాదులను పట్టుకుని కఠినంగా శిక్షించాలని కోరారు. ఉగ్రవాదులకు సహకారాలు అందిస్తున్న వారికి తగిన బుద్ధి చెప్పాలని నినదించారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ నాయకులు పూడిపెద్ది శర్మ, వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు గొర్లె నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

త్వరలో ప్రీపెయిడ్ ఆటో స్టాండ్

- అనుమతులు మంజూరు చేసిన అధికారులు
- తీరనున్న దువ్వాడ రైల్వే ప్రయాణికుల కష్టాలు



దువ్వాడ రైల్వేస్టేషన్ వద్ద నిలిపిన ఆటోలు

అగనంపూడి: దువ్వాడ రైల్వేస్టేషన్‌లో ప్రీపెయిడ్ ఆటో స్టాండ్ ఏర్పాటు చేసేందుకు అధికారులు అనుమతులు మంజూరు చేశారు. నాలుగో నంబర్ ప్లాట్ ఫారం వైపు ప్రీపెయిడ్ ఆటోస్టాండ్ ఏర్పాటు చేసేందుకు రైల్వే అధికారులు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. పోలీసులు తదుపరి చర్యలు తీసుకోవాల్సి ఉంది. ఇది అందుబాటులోకి వస్తే దువ్వాడ రైల్వేస్టేషన్‌కు వచ్చి పోయే ప్రయాణికులకు తిప్పలు తప్పనున్నాయి. ప్రీపెయిడ్ ఆటోస్టాండ్ ఏర్పాటు చేయాలని దువ్వాడ రైల్వేయూజర్స్ అసోసియేషన్, ప్రజా సంఘాలు కొన్నేళ్లుగా కోరుతున్నాయి. ఈ మేరకు రెండు నెలల కిందట దువ్వాడ ట్రాఫిక్ సీఐ కిల్లి వెంకటరావు రైల్వే అధికారులకు వినతిపత్రం అందించారు. స్పందించిన తూర్పు కోస్తా రైల్వే వాల్తేరు డివిజన్ సీనియర్ డివిజల్ కమర్షియల్ మేనేజర్ కె.సందీప్ అనుమతులు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

సురక్షితం.. డబ్బు ఆదా

ప్రీపెయిడ్ ఆటో స్టాండ్ అందుబాటులో లేకపోవడంతో రాత్రి వేళల్లో కొంతమంది ఆటోవాలాలు అధికంగా డబ్బులు డిమాండ్ చేస్తూ ప్రయాణికులను ఇబ్బంది పెడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ప్రీపెయిడ్ స్టాండ్ అందుబాటులోకి వస్తే ఆటోల వివరాలు పోలీసుల వద్ద ఉంటాయి. నిర్దేశించిన ఆటో ఛార్జీలతోపాటు సురక్షితమైన ప్రయాణానికి వీలుంటుందని ప్రయాణికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.